


# ఆజా రే పరదేశీ

రచన: కొమ్ము మారుతిదేవి

రాత్రి 12 గంటల సమయం. నిశ్శబ్దం తాండవిస్తున్నసమయాన డాక్టర్ జుబేదా బేగం తలుపులుకొట్టాడు ఒకాయన.

డాక్టర్ జుబేదా ఆ వూరుకు వొచ్చినది క్రొత్తఅయినా ఆవిడ శాంతం, చేతిచలువ ఎప్పడూ చిరునవ్వులొలికే ముఖం, గొప్పా, బీదా తారతమ్యంలేకుండా అందర్నీ సమానంగా చూడటం, బీదవాళ్లకు ఉచితంగా మందులివ్వటం ఈ గుణాలు ఉండుటవల్ల ఆవిడ ఆ వూరికి తల్లో నాలికలులాగ మెసల సాగింది.

నర్స్ తలుపుతీసింది. జుబేదాకూడా కళ్లు నులుముకుంటూ మేడమెట్లు దిగుతోంది.

డాక్టర్ ప్లీజ్ తొందరగా మాయింటికి రావాలి, టాక్సీతీసుకువచ్చా పురుడురాలేదు. ఆదుర్దాగా అంటూన్న అతని ముఖంకేసి చూసి కొయ్యబారిపోయింది డాక్టర్ జుబేదా.

అతనూ తెల్లబోయాడు. నోటమాటరాలేదు. క్షణకాలం యిరువురూ ఒకరి ముఖాలవంక ఒకరుచూస్తూ నిల్చొనిపోయారు.

అంతలోనే తెప్పరిల్లింది జుబేదా. తన కర్తవ్యం జ్ఞాపకంచేసుకుంది. మానవులకు తనకు చేతనయినంత సాయం చేయటమే తన కర్తవ్యం. నడవండి అంటూ పెట్టె నర్సుతోసహా టాక్సీలో కూర్చొంది.

జుబేదా చేతిచలువ అయితేనేం, ఏదయితే నేం కష్టమనుకొన్న కానుపు సులువుగానే ఒచ్చింది మగపిల్లవాడు.

ఇంటికి వొచ్చేటప్పటికి తెల్లవారగట్ల 5 గంటలవుతోంది. ప్రభాతసమయం, చల్లగా వీచే పిల్లగాలులలో వూలమొగ్గలు మేలుకొంటున్నాయి, జుబేదామనస్సులో పూర్వపు మధురస్మృతులు కెరటాల్లా లేచాయి.

తాను చిన్నప్పుడే తల్లినిపోగొట్టుకొంది. కాని తండ్రి తల్లిలేని లోటుతీర్చాడు. తిరిగి వివాహ మాడకుండా జుబేదాను ప్రాణంగా పెంచాడు. జుబేదా ఆడింది ఆట, పాడిందిపాట. ముస్లిములలో ఘోషా. కాని జుబేదాతండ్రి విశాల హృదయం కలవాడు ఆదర్శభావాలు కలవాడు అందువల్ల జుబేదా చదవసాగింది. తాను కాలేజీలో B.A. లో క్రొత్తగాచేరింది. మధు ఫైనల్ యియర్ చదువుతుండేవాడు, మధు చాలా అందగాడు. తానుకూడా అందగత్తే యని ఇతరులు అనుకుంటూండేవారు. ఒకసారి కాలేజీలో జరిగిన డ్రామాలో ఇరువురూ నాయికా, నాయకుల వేషాలేశారు. ఆజారే పరదేశీ అన్నపాటను యించు మించు లతా మంగేష్కర్‌లా శ్రావ్యంగా పాడింది జుబేదా. అప్పట్నుంచి ఇరువురూ స్నేహితులయ్యారు. ఆ స్నేహం చివరకు ప్రణయంగా మారింది. మతాలువేరు. ఐనా మనస్సులు కలిశాయి.

ఆవేళ తెలుగు ఉగాదిపండగ. జుబేదా సాయంత్రం మల్లెచెట్లకు నీళ్ళుపోస్తు ఆజారే పరదేశీ అన్నపాట పాడుతోంది.

సాయంకాలం నీరెండలో గులాబీరంగు పంజాబీదుస్తులు ఆమె పచ్చటిశరీరానికి వింత కాంతి నిచ్చాయి. ఆమెకళ్ళుమూశారెవరో.

తెలుసులెండి మధుగారూ అంటూ నవ్వి తప్పించుకుంది జుబేదా! మధును చూసింది. ఓహో క్రొత్తబట్టలు అన్నట్లు ఉగాదిగదూ మీ పండగ. టీ యిస్తా లోపలికి నడవండి అంది జుబేదా.

టీ మాటకేంలే, అజారే పరదేశీ పాటపాడు అన్నాడు మధు.

నే పాడను అంది కొంటెగా జుబేదా!

పాడవూ చూడు ఏంచేస్తానో నీ లేతబుగ్గలు కొరికేస్తా అంటూ ఆవేశంగా జుబేదాను దగ్గరకు తీసుకొనబోయాడు మధు.

మధూ ఆగు! మనపెళ్ళికి పెద్దలు ఒప్పుకోరు. మధూ నీవంటె నాకు ప్రాణం. పెద్దల్ని వొప్పించాలి. మన వివాహానికి మీ పెద్దలు ఒప్పుకోరు.

మా నాన్నగార్ని వొప్పిస్తా మీ వాళ్ళను కూడా ఒప్పించు మధూ, జాగ్రతగా కాపాడుకొంటున్న నా కన్యాత్వాన్ని హద్దుమీరిన ఆవేశాలలో ఒక్క నిమిషంలో నేను పాడు చేసుకోలేను అంది. ఆమెకళ్లవెంట ముత్యాలులా నీటిబిందువులు రాలాయి.

పిచ్చిదానా! చదువుకున్నదానివి ఇంత బేలవవుతే ఎట్లు అన్నాడు మధు!

ఆడవాళ్లు ఎంత చదివినా బేలలే అంది జుబేదా!

సరేలే అంటూ చిన్నపుచ్చుకొన్న ముఖముతో దూరంగా వెళ్ళాడు మధు.

మధూ కోపం వచ్చిందా? ప్రమాణంచేసి చెపుతున్నా, నా హృదయంలో నీకు తప్ప మరెవ్వరికితావులేదు, కన్యాత్వం కోలుపోలేను. కాని నా శరీరాన్ని ముందే నీకు అర్పించాను మధూ అంది బాధగా జుబేదా.

మధు ఎంత పట్టుపట్టినా ఒక ముస్లిం పిల్లను కోడలిగా స్వీకరించటానికి తల్లి తండ్రి వొప్పుకోలేదు, పైగా తల్లి వెంటనే నూతిలో

పడి చస్తానంది. అటువంటి వంశం అంది. వంశ గౌరవం నాశనం చేయవొద్దంది. తల్లి మాటకు ఎదురు చెప్పలేకపోయాడు మధు.

అతనిలో ఆనందం చచ్చిపోయింది. అతని మెడలువిరిచి పెళ్లిచేశారు. కాని అతనికి సంతోషం తెచ్చిపెట్టలేకపోయారు.

ఏదో కంపెనీలో పనిచేస్తు కాలం వెళ్ళ బుచ్చుతున్నాడు మధు. మధుకు పెళ్లయిన సంగతి జుబేదాకు తెలిసింది. ఆమెకు పెళ్లి మీద కోరిక లేకపోయింది. ఆమె ఆశలన్ని నిరాశలయ్యాయి. ఆమె మనస్సులో మధు తావు యేర్పరుచుకున్నాడు. అతను ఎప్పటికి తొలగడు. ఈ పెళ్ళి జరగదని ఆమె అంతరాత్మ ఎప్పుడూచెపుతూనేవుంది. తండ్రి ఆమెను పెళ్లిచేసుకోమని బలవంతంపెట్టాడు, తనకు డాక్టర్ చదవాలని ఉందని తండ్రిని వొప్పించి లంచం కట్టించి మెడిసిన్ చదవసాగింది జుబేదా. అలా చదవటానికి కారణాలు ఒకటి మధును మరవటానికి, రెండు తండ్రి పెళ్లిచేస్తానన్న బాధపోరు 6 సంవత్సరాలదాకా ఉండదని, మూడు మానవులకు సేవచేస్తు జీవితం వెళ్లబుచ్చుదామని. మెడిసిన్ తను ఫైనల్ యియర్ చదువుతున్నప్పుడు తండ్రి చనిపోయాడు.

ప్రాక్టీసుచేస్తూ బీదవాళ్లకు ఉచితంగా మందులిస్తూ చిన్నవయసులోనే ధర్మాత్మురాలు అనే పేరు సంపాదించుకొంది జుబేదా.

ఆనాటి మధు ఈనాడు తిరిగి కనిపించాడు. మనస్సును అరికట్టుకోలేకపోతూంది జుబేదా.

అమ్మా అమ్మా ముఖం కడుక్కోండి ఆస్పత్రిలో రోగులు కాచుకూర్చున్నారు అన్న నర్స్‌పిలుపు విని స్వప్నావస్థనుంచి లేచింది డాక్టర్ జుబేదా. టైమ్ 8 గంటలు దాటింది. టాయిలెట్అయి రోగుల్ని పరీక్షించి మందులిచ్చి పంపించి గదిలో పేపరుతీసింది చదువుదామని జుబేదా.

లోపలికి రావచ్చా అన్నమాట విని తలయెత్తింది జుబేదా.

ఎదురుగా మధు.

రావచ్చు కూర్చోండి! సాయంత్రం వొచ్చి చూస్తా పురటాలును, మందు నర్సుయిస్తుంది తీసుకువెళ్లండి ఆమె కులాసాగా ఉందా? బిడ్డ కులాసాయేనా అంది దృష్టి పేపరుమీద నిలుపుతూ.

జుబేదా! నీ ఫీజు ఎంత? అన్నాడు మధు.

మీకు తోచినంత యివ్వండి అంది జుబేదా.

నన్ను క్షమిస్తావా జుబేదా? ఆమాట వినటానికి వొచ్చా అంటూ చేతులు పట్టుకొని కన్నీరు కార్చాడు మధు.

ఎంతయినా ఆడదానిగుండె జాలివల్ల కరగిపోయింది.

అదేమిటి మధూ ఆడదానిలా విచారిస్తావు? జరిగినది మరచిపో! నేను కూడా వివాహం చేసుకోకుండా నిన్ను స్మరిస్తూ జీవితాన్ని గడుపుతున్నా! నిన్ను నా హృదయంనుంచి తొలగించలేకపోయా. ఈ నాడు నీకు భార్యా బిడ్డలు వున్నారు. తిరిగి ఆరోజులు జ్ఞాపకం చేసుకోగూడదు అంటూ కళ్ళు తుడుచుకుంది జుబేదా.

జుబేదా! నీవులేని నాజీవితం అంధకారం. నీ అందమైన సౌందర్యం యౌవ్వనం అడవిగాచిన వెన్నెలేనా? పెళ్ళిచేసుకో అదే నా కోరిక, నాకోరిక తీర్చవా జుబేదా? అన్నాడు బాధగా మధు.

పెళ్ళా? మధూ వొచ్చేజన్మలోనే నాకు పెళ్ళి. ప్రాణంతో సమానంగా పెంచిన నాన్న నాపెళ్ళి చూడకుండా చనిపోయారు. మధూ వచ్చే జన్మలో నిన్నే పెళ్ళాడుతాలే అంది కళ్ళు తుడుచుకుని.

ఒక్కసారి ఆజారే పరదేశీ పాటపాడవా అన్నాడు మధు.

ఛీ! ఇప్పుడా బయట నర్స్‌వాళ్లు నవ్వరూ అంది జుబేదా.

పాడాలి.

వీల్లేదు ?

ఊహుః

ఆజారే పరదేశీ అంది నెమ్మదిగా జుబేదా?

జుబేదా నడుముచుట్టూ చేతులుపడ్డాయి యిప్పుడుకూడా పొమ్మంటావా? జుబేదా అన్నాడు మధు ఆమెచెంపలు నిమురుతూ.

జుబేదా మాట్లాడలేకపోయింది.

నువ్వు వెళ్ళమన్నా వెళ్లను వెళ్లలేను అంటూ ఆమెను గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. ఆనందాశ్రువులు వారి బట్టలను తడిపివేశాయి. లోపలికివస్తున్న నర్స్ ఆ దృశ్యంచూసి వెనక్కుమళ్ళి తలుపు మూసింది. ★

# లోకో భిన్న రుచిః

రచన :

**తాళ్లపూడి వెంకటరమణ**

ఆకలితో పస్తులుండి
అల్లాడుచు కొందరు!
అజీర్ణంతో వైద్యుల కబు
రంపువారు కొందరు!

బిడ్డలకొరకై నోములు
పట్టువారు కొందరు!
బిడ్డలున్న పెంచుట కడు
భారమనును కొందరు!

వళ్ళు వంచి పనిచేయరు
సోమరులై కొందరు!
కష్టించేవారికి పని
కల్పించరు కొందరు!

తోటి మానవుల యందున
దయజూపును కొందరు!
పరులను పీడించుకొనే
బ్రతుకును మరికొందరు!

దేవుని గుడికేగి పూజ
చేయువారు కొందరు!
దేవుని సొత్తంతయు కా
జేయువారు కొందరు!!

లోభత్వమ్మున ధనము
దాచువారు కొందరు!
మంచినీళ్ళ ప్రాయమ్ముగ
ఖర్చుచేయు కొందరు!

పతియే తమ దైవమ్మని
భావించును కొందరు!
పతిని రచ్చకీడ్చి హీన
పరచు స్త్రీలు కొందరు!

ఎంగిలిచేత్తో కాకిని
కొట్టబోరు కొందరు!
పిల్లికైన బిక్షమ్మును
పెట్టరు మరి కొందరు!

తల్లి తండ్రి లేక మిగుల
అల్లాడును కొందరు!
తల్లి దండ్రు లుండ దుడుకు
తనము చేయు కొందరు!

పెట్టెలోన ధనమున్నను
బిక్షమిడరు కొందరు!
కలిగినంత లోనపెట్టి
కరుణింతురు కొందరు!

★